4400 గజాల పార్కు స్థలాలను కాపాడిన హైడ్రా



పార్కు స్థలంలో ఫెన్సింగ్ వేస్తున్న సిబ్బంది

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్‌లోని 4400 గజాల పార్కు స్థలాలను హైడ్రా అధికారులు కాపాడారు. 96/2, 96/3 సర్వే నెంబర్లలో 125 ఎకరాల మేర 582 ప్లాట్లతో పీఅండ్‌టి కాలనీ పేరిట 1989లో లేఅవుట్ వేశారు. ఇందులోని 1200 గజాల పార్కు ఒకటి, 3200 గజాలతో మరో పార్కు స్థలం ఉంది. ఈ రెండింటినీ అభివృద్ధి చేయడానికి వీలు లేకుండా కబ్జా చేసిన వారు అడ్డుకుంటున్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీ అధికారులు పార్కు చుట్టూ ప్రహరీని నిర్మించి కాపాడేందుకు ప్రయత్నించగా కబ్జాదారులు అడ్డుకున్నారు. దశాబ్దాలుగా ఈ వివాదం కొనసాగుతున్నది. దీనిపై హైడ్రా ప్రజావాణికి స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా రంగంలోకి దిగి లేఅవుట్ ఆధారంగా రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి పూర్తి స్థాయి విచారణ చేపట్టింది. పార్కు స్థలాలుగానే నిర్ధారించుకున్న హైడ్రా అధికారులు కమిషనర్ ఏవి రంగనాథ్ ఆదేశాల మేరకు కబ్జాలను తొలగించారు. వెనువెంటనే పార్కు స్థలాల చుట్టూ ఫెన్సింగ్ వేశారు. పార్కులను కాపాడినట్టు బోర్డులు కూడా పెట్టారు. దశాబ్దాల సమస్యకు హైడ్రా తెరదించిందంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. హైడ్రా కమిషనర్‌తో పాటు అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

వర్ధమాన్ అధ్యాపకులకు జాతీయ పురస్కారాలు



ప్రొఫెసర్ రవీంద్ర, ప్రిన్సిపాల్



డా కృష్ణచైతన్య, అసోసియేట్ ప్రొఫెసర్

శంషాబాద్ రూరల్: మండలంలోని వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులకు జాతీయ స్థాయి పురస్కారాలు లభించాయి. నేషనల్ టీచర్స్ డే అవార్డ్స్–20205లో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జీవీఆర్.రవీంద్రకు 'అవుట్ స్టాండింగ్ లీడర్‌షిప్ లెగసీ' అవార్డు దక్కింది. డీన్ (ఆర్‌అండ్‌డీ), అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జె.కృష్ణ చైతన్యను 'బెస్ట్ టీచర్ ఆఫ్ ది ఇయర్–ఎక్సలెన్స్ ఇన్ టీచింగ్' అవార్డుతో సత్కరించారు. కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కంపీటెన్సీస్ ద్వారా ఈ అవార్డులు ప్రధానం చేశారు.

ఆరాంఘర్ చౌరస్తాలో లారీ బోల్తా

అత్తాపూర్: ఆరాంఘర్ చౌరస్తాలో లారీ బోల్తాపడింది. దీంతో ఆరాంఘర్ చౌరస్తాలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మహారాష్ట్ర కళ్యాణ్ నుంచి నగరంలోని సిద్ది అంబర్‌బజార్‌కు శనగపప్పు లోడుతో వస్తున్న లారీ ఆరాంఘర్ చౌరస్తాలో శుక్రవారం ఉదయం ఐదు గంటల ప్రాంతంలో సిగ్నల్ వద్ద డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. లోడ్‌తో ఉన్న లారీని రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు పక్కకు తీసేందుకు ప్రయత్నించారు. డ్రైవర్ నిద్రమబ్బు కారణంగానే ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు.

సర్కారు బడిలో
పోకిరీల హల్‌చల్..!

అసాంఘిక కార్యకలాపాలతో పరేషాన్

- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

అత్తాపూర్: ఓ వైపు బడిని చదువుల గుడిగా మార్చే ప్రయత్నాలు చేస్తుంటే... మరోవైపు పానశాలగా మార్చి వేసేందుకు పోకిరీలు ప్రయత్నిస్తున్నారు. నగర శివారులోని అత్తాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అతి పురాతన బడి అది. ఆ బడిలో చదివిన వారిలో పలువురు ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు. ప్రభుత్వ ఆదరణ లేక నిధులు, నిర్వాహణ లేమితో ఆ బడి భవనం కాస్తా శిథిలావస్థకు చేరుకుంది. బడిలో పని చేసే ఉపాధ్యాయులు దీన్ని బాగు చేసే ప్రయత్నం మొదలు పెట్టారు. ఈ బడి పూర్వ విద్యార్థులు, స్థానికులు ఆర్థిక సహకారంతో ఉపాధ్యాయులు గుడిగా తీర్చిదిద్దే ప్రయత్నాలు చేశారు. ఇప్పుడా బడి సౌకర్యాలతో మళ్లీ అందంగా రూపు దిద్దుకుంది. మొక్కలు, చెట్లతో ఆహ్లాదకరమైన పరిసరాలతో బడి అందంగా తయారైంది. కానీ ఈ బడి భవనంలోకి రాత్రి వేళల్లో స్థానికంగా ఉండే కొందరు పోకిరీ యువకులు ప్రవేశించడం, అక్కడే మద్యం సేవించడం, పత్తాలు లాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. దీంతో ఆ బడి రాత్రివేళల్లో అసాంఘిక కార్యక్రమాల అడ్డాగా మారిపోయింది. అంతేకాక భవనం కిటికీలను, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. దీనిపై అనేక మార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయిందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులకు ఈ సంగతిని విన్నవించినా ప్రయోజనం లేకుండాపోయిందని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అవేధన వ్యక్తం చేస్తున్నారు.



తరగతి గదుల కిటికీలను ధ్వంసం చేసిన పోకిరీలు

శిథిలావస్థలో ఉన్నదాన్ని బాగు చేశారు..

రెండు సంవత్సరాల క్రితం అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంతో దయనీయమైన స్థితిలో ఉండేది. అపరాశు అపరిశుభ్రంగా ఉన్న టాయిలెట్స్, గదులు కూలిపోయేందుకు సిద్ధా ఉన్నా తరగతి గదులు వంట చేయలేని పరిస్థితిలో కిచెన్ రూమ్ ఉండేది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్) కింద అత్తాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు స్థానికంగా ఉన్న బ్యాంకులు కార్పొరేట్ సంస్థలు పూర్వ విద్యార్థులు స్థానిక కార్పొరేటర్ సంగీతగౌరీ శంకర్ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టరు. అదనపు తరగతి గదులు, కంప్యూటర్లు, ప్రత్యేక బోరుబావి, వాష్ రూమ్, ప్రహరీ నిర్మాణం లాంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. మరికొన్ని సంస్థలు ఉచిత నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, విద్యార్థులకు కావాల్సిన ఆట వస్తువులను ఇప్పించారు.



అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు



పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్న క్లాస్ రూమ్‌లో విద్యార్థులు (ఫైల్)

పెరుగుతున్న పోకిరీల ఆగడాలు..

అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిసరాల్లో పోకిరిల ఆగడాలు దినదినానికి పెరిగిపోతున్నాయి. పాఠశాలలోకి చొరబడి అద్దాలు, ఫర్నీచర్ తదితర వాటిని ధ్వంసం చేస్తున్నారు. ఎంతో మంది దాతల సహకారంతో పాఠశాల అభివద్ధి చేస్తుంటే కొంత మంది పోకిరీలు మాత్రం అదేపనిగా రాత్రి వేళల్లో పాఠశాలలకు ప్రవేశించి ఈ మధ్యకాలంలోనే నూతనంగా నిర్మించిన తరగతి గదుల కిటికిలను సైతం ధ్వంసం చేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత విచారం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సమీపంలోని అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్‌సాగర్, జ్యోతి పాల్గొన్నారు.

గంగ ఒడికి గౌరీసుతుడు

- వైభవంగా కొనసాగుతున్న గణనాథుల నిమజ్జనోత్సవం
- పత్తికుంట, పల్లెచెరువులో 2,569 విగ్రహాల నిమజ్జనం



పత్తికుంటలో గణేశ్ ప్రతిమను నిమజ్జనం

రాజేంద్రనగర్: గణేశ్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో తొమ్మిదవ రోజు శుక్రవారం పత్తికుంట, పల్లెచెరువులో మొత్తం 2,569 గణనాథుల విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ సురేందర్ రెడ్డి, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ రజనీకాంత్ తెలిపారు. రాజేంద్రనగర్ సర్కిల్‌తో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున గణనాథులను తరలించారన్నారు. పత్తికుంట వద్ద నాలుగు క్రేన్లు, పల్లె చెరువు వద్ద రెండు క్రేన్లను ఏర్పాటు చేసి భారీ గణనాథులను నిమజ్జనం చేశామన్నారు. భారీ గణనాథులతో పాటు చిన్న గణనాథులను పెద్ద ఎత్తున తీసుకొచ్చారన్నారు. పత్తికుంట వద్ద ఏర్పాటు చేసిన కొలనులో చిన్న గణనాథులను నిమజ్జనం చేశామన్నారు. 9వ రోజు గురువారం మధ్యాహ్నం నుంచి నిమజ్జన కార్యక్రమాలు శుక్రవారం తెల్లవారుజాము వరకు కొనసాగాయన్నారు. ప్రధాన రహదారులపై పత్తికుంట, పల్లె చెరువు వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌ను చేపట్టామన్నారు. ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి పనులను చేపట్టినట్లు వెల్లడించారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించినట్లు వెల్లడించారు. చెరువుల్లో సైతం వేసిన చెత్త చెదారాలన్నింటిని క్లీన్ చేశామన్నారు.



నిమజ్జనోత్సవాన్ని పరిశీలిస్తున్న డీసీ సురేందర్ రెడ్డి, ఏఎంహెచ్‌ఓ రజనీకాంత్

గణనాథులకు వీడ్కోలు

శంషాబాద్ రూరల్: గణనాథులు నిమజ్జనానికి తరలిపోతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక విగ్రహాలను భారీ ఊరేగింపులు, భజనలతో నిమజ్జనానికి తరలించారు. కవ్వగూడలో బురుజు మైసమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద దాత మెరుగు హరి ప్రసాద్ అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో స్థానికులు బాలు ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు. జూకల్‌లో వినాయక పూజకు ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. మాజీ సర్పంచు పి.శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



అలకాపూర్ ఎంజీ పార్క్‌లో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



జూకల్‌లో పూజకు హాజరైన ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి



కవ్వగూడలో అన్నప్రసాద వితరణలో దాత హరిప్రసాద్

విశ్వకర్మల అభ్యున్నతికి ప్రభుత్వాలు సహకరించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశ్వకర్మల అభ్యున్నతికి సహకరించాలని కాటేదాన్‌లోని శ్రీ విరాట్ విశ్వకర్మ దేవాలయ వ్యవస్థాపకులు పులిగిళ్ల శ్రీనివాసచారి కోరారు. కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతి సందర్భంగా సెలవు ప్రకటించిందన్నారు. కానీ ప్రభుత్వం అమలు చేయకపోవడం విచారకరమన్నారు. సెప్టెంబర్ 17 అంటే కేవలం విమోచన దినంగా ఉందని అయితే విరాట్ విశ్వకర్మ జయంతి కూడా సెప్టెంబర్ 17నే ఉందన్నారు. దీనిని ఎవరూ గుర్తించడం లేదన్నారు. ప్రజలందరికీ తెలిసేలా విశ్వకర్మలంతా ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించి సెప్టెంబర్ 17 విరాట్ విశ్వకర్మ జయంతి సందర్భంగా సెలవు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

17న విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాలు

విశ్వకర్య యజ్ఞం చేయడం ద్వారా విశ్వమంతా సుభిక్షంగా ఉంటుందని శ్రీనివాసచారి పేర్కొన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ శాంతినగర్‌లోని దేవాలయంలో యజ్ఞ మహోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విశ్వశాంతి కోసం విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17వ తేదీన రంగారెడ్డి జిల్లా విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) సంఘం ఆధ్వర్యంలో యజ్ఞ మహోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. శ్రీ విరాటగ్ విశ్వకర్మ భగవానుని దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించి పునీతులు కావాలన్నారు. ఉదయం 7 గంటల నుంచి విశ్వకర్మ పూజ, విశ్వకర్మ యజ్ఞం, మహాసభ, మహాప్రసాద వితరణ(భోజనం) సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతుందన్నారు. ఆలయ ప్రధాన కార్యదర్శి కాసోజు మాధవాచారి, యజ్ఞ కమిటీ అధ్యక్షులు వల్ల ఆంజనేయులుచారి, కార్యనిర్వహణ అధ్యక్షులు వైనోజు మహేష్‌చారి, దేవాలయ కమిటీ సభ్యులు పులిగిళ్ల జ్ఞానేశ్వర్‌చారి, రాంపల్లి రవీంద్రచారి, సి.హెచ్. జగన్‌మోహన్‌చారి, పులిగిళ్ల రమేష్‌చారి, మారోజు నరేంద్రచారి, మారోజు నరేంద్రచారి, డాక్టర్ వెంకటస్వామిచారి, నారోజు రాజేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'భక్త ప్రహ్లాద'



శంషాబాద్: పట్టణంలోని వివేకానంద కాలనీలో హిందూ వికాస్ గణేశ్ ఉత్సవ సమితి ఏర్పాటు చేసిన ప్రకృతి వరసిద్ధి వినాయకుడి వద్ద ప్రదర్శించిన భక్త ప్రహ్లాద నాటకం భక్తులను కట్టిపడేసింది. ఉత్సవ సమితి అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి అక్కడికి విచ్చేసిన అతిథులకు స్వాగతం పలికి సన్మానం చేశారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ హన్మంతురెడ్డి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

శాస్త్రిపురం: మిలాద్ ఉన్ నబీ పండుగను శాస్త్రీపురం, సులేమాన్‌నగర్ డివిజన్‌ల ప్రజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు అందరు కలిసి సంతోషంగా మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజును జరుపుకోవడం కనిపించింది. సంప్రదాయ దుస్తులు ధరించి ఒకరికి ఒకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హసన్‌నగర్, శాస్త్రీపురం, సులేమాన్‌నగర్, ఎంఎం పహాడీ, నౌ నంబర్, వాదియామహ్మద్ కాలనీ, ఇంద్రానగర్, బాబానగర్ ప్రాంతాలలోని మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ పండగ శాంతి, దయ, కరుణ, ఐక్యత వంటి గొప్పలు విలువలను గుర్తు చేస్తుందని ఈమామ్‌లు తెలిపారు. ఉపన్యాసాలు, ఖురాన్ పఠనాలు జరిపి మహ్మద్ ప్రవక్త బోధనలను వివరించారు. అనంతరం మసీదుల వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. పలు బస్తీలలో చిన్నారులు, యువకులు ర్యాలీలు నిర్వహించారు. ఆయా ప్రాంతాలలో మిలాద్ ఉన్ బి సందర్భంగా పోలీసులు బందోబస్తును నిర్వహించారు.



శాస్త్రీపురం, సులేమాన్‌నగర్‌లలో ర్యాలీలు నిర్వహిస్తున్న ముస్లింలు

జీఎస్టీ మార్పులతో పేదలకు ఎంతో మేలు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

మణికొండ: జీఎస్టీ స్లాబ్‌లలో తెచ్చిన మార్పులతో పేదలు, మధ్య తరగతి వారికి ఎంతో మేలు జరుగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.అంజన్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం నార్సింగి మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు జి.నగేష్‌యాదవ్ ఆధ్వర్యంలో నార్సింగి అంబేడ్కర్ చౌరస్తాలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. నాయకులు డి.లక్ష్మీనారాయణ, భిక్షపతియాదవ్, జి.శివరాజ్, బి. కిరణ్‌కుమార్, ఎన్.రాజేందర్, వెంకటేష్, జైపాల్‌రెడ్డి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

- దీజేల నిర్వాహకులపై కేసు నమోదు

రాజేంద్రనగర్: గణేశ్ నిమజ్జన ఊరేగింపులో డీజేలను ఏర్పాటు చేసిన ఐదు మండపాల నిర్వాహకులపై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సూచనలు పట్టించుకోని వీరిపై కేసు నమోదు చేశారు.

లడ్డూలు.. అ'ధర'హో..

వేలంపాటల్లో రూ. లక్షలు పలుకుతున్న గణనాథుడి లడ్డూలు



మంచిరేవులలో రూ. 6.03 లక్షలకు లడ్డూ దక్కించుకున్న విశ్వనాథ్ అప్ప



పుప్పాలగూడ హనుమాన్ ఆలయంలో రూ. 4.55 లక్షలకు బట్ట చిన్న నరసింహా...



కోకాపేటలో లడ్డూను రూ. 6 లక్షలకు దక్కించుకున్న మాజీ కౌన్సిలర్ దుర్గేష్‌యాదవ్



పుప్పాలగూడ సెక్రటేరియట్ కాలనీ రూ. 3.69 లక్షలకు దక్కించుకున్న సత్యనారాయణ

మణికొండ: తొమ్మిది రోజుల పాటు వినాయకుడి చేతులో ఉండి పూజలు అందుకున్న లడ్డూలను పలువురు వేలం పాటల్లో పోటీలు పడి దక్కించుకున్నారు. గురువారం రాత్రి, శుక్రవారం నిమజ్జనాలకు తరలిన వినాయకుడి లడ్డూలను అంతకు ముందు వేలం పాటలు నిర్వహించారు. దాంతో వాటిని కొనుగోలు చేస్తే కలిసి వస్తుందనే నమ్మకంతో అనేక మంది పోటీలు పడ్డారు. వారిలో అత్యధికంగా వేలం పాట పాడిన వారికి అవి దక్కాయి. వేలంలో వచ్చిన లడ్డూలతో తమ ఇంటి వరకు బ్యాండ్‌మేళంతో ఊరేగింపుగా వెళ్లారు. శనివారం జరిగే వేలంపాటల్లో లడ్డూలను దక్కించుకునేందుకు అనేక మంది సిద్ధ అయ్యారు. వాటి ధరలు రికార్డులు బ్రేక్ చేసే అవకాశమే ఎక్కువగా ఉందని ఆయా మండపాల నిర్వాహకులు తెలిపారు.



పీరంచెరువులోని గణేశ్ లడ్డూను రూ .3.2 లక్షలకు గోకుల్ మహేష్‌యాదవ్



పుప్పాలగూడ సాయిరాంకాలనీ రూ. 2.55 లక్షలకు దక్కించుకున్న విజయ్‌కుమార్



కోకాపేట ఓషియన్ పార్క్‌లో రూ. 2.50 లక్షలకు కైవసం చేసుకున్న కావలి మల్లేష్ ముదిరాజ్

ఉత్తమ అధ్యాపకులకు అభినందనల వెల్లువ



అత్తాపూర్‌లో నివాళులర్పిస్తున్న ఉమామహేశ్వరిరెడ్డి తదితరులు

ఏజీవర్సిటీ: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన అధ్యాపకులకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ జానయ్య, సిబ్బంది అభినందనలు తెలిపారు. అవార్డు పొందిన వారిలో డాక్టర్ జె.హేమంత్‌కుమార్, డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్, డాక్టర్ హేమలత, డాక్టర్ రాజేందర్, డాక్టర్ సాయిప్రద్ ఉన్నారు.

శంషాబాద్‌లో...

శంషాబాద్: పట్టణంలోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల డిగ్రీ కళాశాల (పురుషుల)లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి బోధన చేశారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ షహనా నజ్నీన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నరేష్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



అవార్డులు అందుకున్న అధ్యాపకులతో వీసీ

అత్తాపూర్‌లో..

అత్తాపూర్: గురువులు విద్యార్థుల జీవితంలో ముఖ్యభూమిక పోషిస్తారని బీజేపీ నాయకురాలు ఉమామహేశ్వరిరెడ్డి అన్నారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

PUBLIC NOTICE

Our Client- Mr. Kommareddy Tarun, residing at 42-973, Jawahar Nagar, Lile Spring Hospital, Maula-Ali, Malkajgiri, Hyderabad – 500 040, has entered into an agreement to purchase the following land – **land bearing Sy.No. 102/6/1 & 102/6/2, Kanarkamamidi (v), Moinabad (M), Rangareddy District Telangana totally admeasuring Ac 00-17 Gts, and bounded as follows: *North*: Mohammed Aziz, *South*: Mohammed Aadil, *East*: Neighbours land, West: Road ('Subject Property')** from Mr. Pulusani Sukender Singh.

We hereby call upon any person from the public who may have any claim or right of any nature whatsoever over the Subject Property to contact us at the below mentioned address within seven (7) days from today along with relevant papers and to state the nature of his/her claim over the Subject Property. If no claims are received within seven (7) days, it will be deemed that no person has any claim or right over the Subject Property and he/she shall be disentitled to raise any claim over the Subject Property at any future date.

HARIJA AKKINENI, Advocate
Office at H.No. 6-3-249/A/5, Naveen Nagar, Khairatabad, Hyderabad-500 004.
Phone: 9440562579.
Email: harija_ocps@rediffmail.com